# "దేవుడా! నువ్వుండి తీరాలి"

ఎం. శారదా చౌదరి

వాతావరణం ఒక్కసారిగా చల్లబడిపోయి ఈదురు గాలి ప్రారంభమయింది. నీటి కోసం కొలను వేపు పరుగెత్తుతున్న ఏనుగుల గుంపుల్లా. మేఘాలు ఆకాశాన్నంతా ఆక్రమించుకుంటు న్నాయి. వుండీ....వుండీ కోపంతో గర్జిస్తున్నాయి. పెరట్లోని రెండు కొబ్బరి చెట్లూ ఒకదానితో ఒకటి పోటీపడి పిచ్చిపట్టినట్లుగా ఆపకుండా తలలూపు తున్నాయి.

"ధుం....ధుం....ధుం....ధుమ్!"

ఇంత చల్లని అనుకూలమైన వాతావరణంలో ఇంట్లో కూర్చోలేక ఆటల కోసం అమ్మ చూడ కుండా బయటకు జారుకున్న బాబు వులిక్కిపడి—

"అర్జునా! అర్జునా!" అనుకున్నాడు. అయినా మరొక్కసారి నలుదిశలూ దద్దరిల్లి పోయేలా గర్జించిందా మేఘం.

బాబుకి భయం వేసింది.

"అర్జునా! అర్జునా!....అర్జున, ఫల్గుణ, పార్థ కిరీటీ" నాన్నమ్మ పాడుకుంటుంటే విన్న చర ణాలు మననం చేసుకున్నాడు. ఆ పైనరాక మళ్ళీ ఆదే తిప్పి తిప్పి అనుకుంటూ నడక వేగం హెచ్చించాడు.

బాబు తన స్నేహితులతో ప్రతి సాయంత్రమూ, శెలవు దినాల్లో అయితే మూడు పూటలూ ఆటల్లో మునిగిపోయి, భూలోక స్వర్గం అంటే, ఇదే అనుకునే స్థలమే గుడి వెనుక భాగం. రోజూ ఆటలయిపోయిం తర్వాత, ఆకుపచ్చని ఆ కోనేటి నీళ్ళల్లో చేతులూ కాళ్ళూ కడుక్కుని స్వామిని ఆషామాషీగా దర్శించి, పూజారి అందించిన ఫల హారాన్ని ఒక్కసారిగా బొక్కేసి, 'పి పీ ప్.... పి పీ ప్' మనుకుంటూ ఇంటికి దూసుకుపోతారు పిల్లలంతా. అది మార్పులేని దినచర్య.

కానీ బాబు దేవుని దర్శించినపుడు అమాయ కంగా ప్రార్థించేవాడు. "స్వామీ! నీదగ్గర స్వర్గ ముందిట. అక్కడ వుండే ప్రజలకు, ఆకలి దప్పులూ, అసూయా ద్వేషాలూ వుండవట.



అందుకే వాళ్ళను దేవతలంటున్నారట. నాయందు దయవుంచి, నన్ను పాలించి, (ఇందులో నాన్నమ్మ కవిత్వపు పాలు కాస్త కలిసింది కూడా) చచ్చిపోయిం తర్వాత నన్ను నీ దగ్గరకు తీసుకుపో తండ్రీ! నేనేదైనా తప్పుచేస్తే క్షమించు కానీ నరకంలో తొయ్యకు.. తెలిసి నేనింకెప్పుడూ పాపం చెయ్యను. తూనీగల్ని పట్టను. సీతాకోక చిలుకల్ని అంటుకోనే అంటుకోను. చెరువులో చేప పిల్లల్ని పట్టి సీసాలో వెయ్యను. తెలియక చిన్నప్పుడు చేశాను. అందుకు క్షమించు స్వామీ! ఇంకెప్పుడూ చెయ్యనుగా!" దేవుడి ముందు ప్రమాణాలు చేసి, లెంప లేసుకునేవాడు.

చాలా రోజులక్రితం, ఇంటిముందు పూల మొక్కల మీద ఎగురుతున్న రంగు రంగుల సీతాకోక చిలుకను పట్టుకుని కేరింతలు కొడుతూ, తన్మయత్వంలో మునిగిపోయి గంతులేస్తున్న బాబుని చూసి నాన్నమ్మ కోప్పడింది.

"ఒరేయ్! బాబిగా అలా చేయకూడదు. తప్పు!....తప్పురా నాయనా! ముందు దాన్ని వదిలేసి చెంపలేసుకో....ఇంకెప్పుడూ చెయ్యనని"

"ఏం! ఎందుకే?" బాబు తల ఎగరేసి మొండిగా అడిగాడు.

నాన్నమ్మ దగ్గరకు వచ్చి, నెమ్మదిగా బాబు చేతిలోని సీతాకోక చిలుకను విడిపించి, తల నిమురుతూ అంది.

"నువ్వు దాని రెక్కలు విరిచేసినట్లు పట్టుకుంటే దానికెంత బాధ? వాటికి నోరు లేదు కదా బాధను పైకి చెప్పుకోలేవు. పైకి చెప్పుకోలేకా, బాధ భరించలేకా దేవుడిని తలచుకుని ఏడుస్తాయి. నిన్నెవరయినా కొట్టారనుకో, మీ నాన్నకు చెప్పి వాళ్ళను మళ్ళా కొట్టిస్తావు. పాపం! ఇది అల్ప ప్రాణి కదూ నీ కెదురు అడగ గలదా? నోరు లేదు కనుక ఎవరికి చెప్పుకో గలదు? ఒక్క దేవుడికి తప్ప! వాటిగోడు దేవుడు వింటాడు. నీ మీద కోపం తెచ్చుకుంటాడు. తన బిడ్డను మరో బిడ్డ బాధిస్తున్నాడూ అంటే కోపం రాదూ మరి? చెల్లాయిని నువ్వు కొట్టావనుకో—అమ్మకు మీ ఇద్దరూ సమానమైనా, చెల్లిని కొట్టినందుకు కోపం వచ్చి నిన్ను కొడుతుందిగా! దేవుడూ అంతే! నువ్విప్పుడు పాపం చేస్తే వచ్చే జన్మలో గుడ్డి వాడుగానో, కుంటి వాడిగానో పుట్టించి, నీ తప్పు నీకు తెలిసి వచ్చేలా చేస్తాడు."

బాబుకి అర్థం అయ్యీ కానట్లుగా వుంది. ఆ రాత్రి నానమ్మ చెల్లాయికీ, తనకీ అన్నం పెడుతూంటే కుతూహలంగా అడిగాడు.

"నానమ్మా! దేవుడెక్కడుంటాడు?"

"స్వర్గంలో"

"మనకు కనిపిస్తాడా?"

"ఇప్పుడు కనిపించడు. నువ్వు మంచివాడివై ఎవ్వరికీ అపకారం చేయకుండా దేవుడినే పార్థిస్తూ మమకారాల్ని జయించి నప్పుడు తప్పకుండా కనిపిస్తాడు."

"మమకారం అంటే?"

"ఇప్పుడు నీ కర్థం కాదురా. పెద్దయిం తర్వాత తెలుస్తుంది."

"నాన్నమ్మా! నాకు దేవుడిని చూడాలని వుంది."

ఆ మాటకు నాన్నమ్మ నవ్వింది.

"వూరికే చూడాలనుకుంటే దేవుడు కనిపిస్తాడా? ఇహ సుఖాలనాశించకుండా, కోరికలను జయించి భగవన్నామస్మరణలో పడిపోయినప్పుడు తప్పకుండా మోక్షం లభిస్తుంది."

"దేవుడున్నాడని నీకెలా తెలుసు నాన్నమ్మా!"

"పిచ్చి నాయనా! దేవుడు లేకపోతే నువ్వెలా వచ్చావు? నేనెలా వచ్చాను? సకల చరాచరాలూ ఆయన సృష్టించినవేగా!"

"అందుకనేనా పండగలు చేసుకుంటూ దేవుడికి పూజలు చేస్తాం?" పండగలప్పుడు గుడిలో దేవుడిని వూరేగించడం గుర్తు వచ్చింది బాబుకి.

"అందుకేరా నాయనా!"

భోజనాలు పూర్తయ్యాయి. బాబు కళ్ళింతంతవి చేసుకుని ఒక్కొక్కప్పుడు నోట్లో ముద్ద మింగటం కూడా మరచిపోయి చెవులు రిక్కించుకుని విన్నాడు.

ఆ రోజే కాదు. ఆ తరువాత ప్రతిరోజూ నాన్నమ్మను దేవుడిగురించి ప్రశ్నించే వాడు. ఆవిడ చెబుతూంటే అర్థరాత్రి అయినా, నిద్ర పోకుండా వినేవాడు.

ఆరేళ్ళ ఆ పసి మనస్సుకి అప్పటికి తెలిసిన విషయాలు బాగా హత్తుకుపోయాయి.

"దేవుడు సర్వాంతర్యామి. అంటే అన్ని చోట్లా వున్నాడు. వుండి ఎవరు పాపం చేస్తున్నారో చూస్తాడు. చూసి వాళ్ళను శిక్షిస్తాడు. మంచి వాళ్ళను రక్షిస్తాడు."

అప్పటినుంచీ బాబుకి దైవ ప్రార్థన అలవాటయింది. ఆ చిన్నారి మనస్సు దేవుడిని చూడటం కోసం పరితపించేది. కాని వెనువెంటనే నాన్నమ్మ మాటలు గుర్తుతెచ్చుకుని వూరడిల్లేది.

"ఇతరులను బాధపెట్టి పాపం చెయ్యకూడదు. స్వార్థం పనికిరాదు. అందరికీ సహాయం చేసి పుణ్యం సంపాదించాలి. స్వార్థాన్ని జయించి దేవుడిని ఆరాధిస్తే, చనిపోయిన తర్వాత దేవుడే స్వయంగా వచ్చి మనల్ని తన దగ్గరకు తీసుకెళ్తాడు." వూహలతోనే ఒళ్ళు పులకరించేది బాబుకి.

రోజూ గుడి వెనక ఆడుకుంటూ, దేవుడిని ప్రార్థిస్తూ, పదో సంవత్సరంలోకి అడుగుపెట్టాడు. హైస్కూలులో ప్రవేశించాక, సత్యం మాష్టారు సైన్సు పాఠం చెబుతూ "దేవుడులేడు, అంతా అబద్ధం. దేవుడున్నాడని చెప్పేవాళ్ళంతా వుట్టి మూర్ఖులు, అజ్ఞానులు" అంటూ ఏవేవో చెప్పేవారు.

బాబుకి కోపం వచ్చేది. మాష్టారి నెదిరించి, "దేవుడున్నాడు" అని చెబుదామా అనుకునేవాడు కానీ భయం చేత ఆగిపోయేవాడు.

బాబు ఒక్కోక్లాసుకూ వస్తూంటే మాష్టారి మాటలు నమ్మవలసి వస్తోంది. జీవపదార్థము ఎలా ఏర్పడిందో, ప్రాణులెలా వుద్భవించాయో చదువుతుంటే దేవుడు లేడనుకునేవాడు బాబు. అతని అనుమానం రోజు రోజుకీ బలపడ సాగింది. కానీ నాన్నమ్మ వివరించిన ప్రకారం దేవుడున్నాడేమో ననే అనుమానమూ వుండేది. కానీ దేవుడనే వాడుంటే అన్యాయం ఇంతగా ఎందుకు ప్రబలిపోతూందో అతనికర్థం కావడం లేదు. నాన్నమ్మ చిన్నతనంలో అసలు దొంగతనాలే వుండేవికావట. ఎవరికైనా అవసరమయి, గుమ్మడికాయ కావాలంటే, ఆ చేను యజమానులెవ్వరూ లేకపోతే, కాయ కోసుకుని దాని స్థానంలో దమ్మిడీ పెట్టి వెళ్ళి పోయేవాళ్ళట.

కారణం–భగవంతుడున్నాడు. తప్పు చేసినా, అన్యాయం చేసినా శిక్షిస్తాడు అనే భయంవల్ల. ఇప్పుడు ఆ భయం పోయింది. దేవుడు లేడంటూ నూటికి తొంభైమంది వాదిస్తున్నారు. దేవుడే లేడనుకుంటూంటే ఇంక అక్రమాలు చెయ్యటానికి భయమేమిటి? ఎక్కడ చూసినా దొంగతనాలూ, దోపిడీలూ; లేచిన దగ్గర నుండీ, 'సక్రమంగా బ్రతకగలమా? లేదా?' అన్న ఆరాటం!

మనిషికీ, మనిషికీ మధ్య వుండవలసిన

మమతా, మానవతా, అవగాహనా మృగ్యం అయినప్పుడు దేవుడికి చోటెక్కడ ?

చాలా రోజులనుండీ విపరీతమయిన సంచలనాన్ని రేకెత్తిస్తున్న ఆలోచనల్ని కూడదీసుకోవటానికి వ్యర్థ ప్రయత్నం చేస్తున్నాడు బాబు.

మానవుల్లో వుండవలసిన మంచితనమే దేవుడు. నీతీ, నిజాయితీలే ఆయనకున్న వివిధమయిన పేర్లు. మానవతా, న్యాయమూ, దయా, దాక్షిణ్యమూ, శాంతి, అహింసలే ఆయన సుగుణాలు.

దేవుడు అంటే ఒక ఆకారంతో ఎక్కడో ఆకాశంలో కూర్చుని లేడు. ప్రతి ప్రాణిలో, ప్రతి పదార్థంలోనూ వున్నాడు. అందుకే సర్పాన్ని నాగేంద్రుని పేరుతోనూ, కుక్కను గౌరీదేవిగానూ పూజిస్తున్నారు. ప్రతి ప్రాణికీ గౌరవం ఇవ్వటమే పూజించడం. నాలుగు వరాహాల్ని చంపి నాలుగు రోజులు భుజించి రెండు కొబ్బరికాయలు కొట్టినంత మాత్రాన ఆ హత్యానేరం, చేసిన పాపం రద్దయిపోతాయా? లేదు!....లేదు....బాబు మనస్సు గాలికి వూగిపోతున్న చిరుదీపంలా ఆలోచనలతో అల్లాడిపోతూంది.

"దేవుడు లేడు...."

"ఉహూ! వున్నాడు...."


"లేడు! మనిషిలోని మంచితనమే దేవుడు."

"ఏమో! వున్నాడో లేడో!"

"వున్నా. మనుష్యులు కొలుస్తున్న ఈ రూపంలో లేడు."

బాబు మనస్సు వూగిసలాడి, దేవుడు లేడేమోననే భావనవైపు మొగ్గు చూపింది.

క్రమంగా ఈదురు గాలి ఎక్కువయ్యింది. సాయంత్రం నాలుగు గంటలే అవుతున్నా మేఘాల నీలిమలో చుట్టూ చీకట్లు ముసురుకోసాగాయి. చెట్లు పూనకం వచ్చిన వాటిలాగా వూగిపోతున్నాయి. బాబు గబగబా అడుగు లేశాడు. అతని వూహకు విరుద్ధంగా గుడి వెనుక ఒక్కళ్ళూ లేరు. నిర్మానుష్యంగా వున్న ఆ ప్రదేశంలో వంటరిగా వున్న బాబుకి భయం వేసింది. లోపలికి వెళ్ళటానికి ధైర్యం చాలక గుడి బయట నుండే భయపడుతూనే గబగబా దణ్ణం పెట్టేసుకుని వెనుదిరిగి పరుగెత్తాడు. ఇరవై గజాలు ముందు కొచ్చేసి రావి చెట్టు కింద అనుమానంగా ఓ క్షణం ఆగిపోయాడు. కెవ్వు, కీవ్వుమన్న కేక విని,




వూపిరి తీసుకోవటం కూడా మరచిపోయి వెనుదిరిగి చూసే లోగానే నోరు మూసి పక్కకు లాగారెవరో. అరవకుండా నోరు మూశారు కానీ జరిగే ఘోరం చూడు—అన్నట్లుగా కళ్ళు మూయలేదు. బాబు మనస్సు గిలగిలా తన్నుకుంది. తప్పించుకోవటానికి వ్యర్థ ప్రయత్నం చేశాడు. మేరు పర్వతంలా వున్న అతని ముందు, పిచ్చుకలా వున్న తన బలమెంత? అయిపోయింది. అంతా అయిపోయింది. తన ప్రాణస్నేహితుడు రవి అక్కయ్య బ్రతుకు సర్వనాశనం అయిపోయింది.

మల్లేశ్వరి శక్తినంతా వుపయోగించి పోరాడింది. వాడిని ప్రార్థించింది. కాళ్ళు కూడా పట్టుకుంది. ఫలితం లేకపోతే "దేవుడూ! నువ్వే నాకు దిక్కు" అంటూ దిక్కులన్నీ జాలిపడేలా ఏడ్చింది. గుండెలు పగిలేలా ప్రార్థించింది. కానీ ఆమె మొర ఏ దేవుడూ వినలేదు. అంతా బాబు చూస్తూనే వున్నాడు. చివరికి చూడలేక కళ్ళు గట్టిగా మూసుకున్నాడు. అంతవరకూ స్త్రీ, పురుష సంబంధమేమిటో చూచాయగానైనా తెలియని అతని మనస్సు జుగుప్సతో, అసహ్యంతో, క్రోధంతో చెప్పలేనన్ని భావాలతో కసిగా తయారయింది. మానవత్వాన్ని మరచిపోయి దానవుల్లా ప్రవర్తిస్తున్న వాళ్ళ రాక్షసత్వాన్ని బాబు కోపమూ, కసీ ఏం చెయ్యలేక పోయాయి.

గాలి వుధృతం ఎక్కువయింది. టపటపా చినుకులు రాలటం మొదలెట్టాయి.

మల్లేశ్వరి నక్కడే వదిలేసి లుంగీ చుట్టుకుంటూ వచ్చాడతను. అడుగుల చప్పుడు విని బాబు కళ్ళు తెరిచాడు. "వీడు! వీడు ప్రెసిడెంట్ కొడుకు సురేంద్ర కదూ! పట్టణంలో చదువుకుంటూ శలవల కొచ్చిన మూర్ఖుడు." బాబు పూనకం వచ్చిన వాడిలాగా వూగిపోయాడు.

"వీడి సంగతి నేను చూస్తాను. దాన్ని నీ యిష్టం వచ్చినంతసేపు....హి....హి" వికృతంగా నవ్వేడు. బాబు చేతులు మారాడు.

స్పృహలో లేని మల్లేశ్వరి కూడా చేతులు మారింది.

మల్లె మొగ్గలా అమాయకంగా పవిత్రంగా వున్న ఆమె జీవితం ఇద్దరు పాపిష్టుల బలహీనతకు బలియై సర్వనాశనం అయిపోయింది.

అంతా అయిపోయి శవాకారం మిగిలిన తర్వాత, బాబుని కూడా అక్కడే వదిలేసి వెళ్ళిపోయారు.

చినుకులు వర్షంగా మారిపోయాయి. వర్షం కుండపోతగా మారింది. రోజు రోజుకి పెరిగిపోతున్న పాపంలా చీకటి నలు దిక్కుల్నీ భయంకరంగా కమ్ముకోసాగింది. జరిగిన భీభత్సాన్ని చూసి సహించలేను అన్నట్లుగా ప్రకృతి భీకరాకారం దాల్చింది.

బాబు క్షణం ఆలశ్యం చెయ్యకుండా మల్లేశ్వరి దగ్గరకు పరుగెత్తాడు "అక్కా" అంటూ.

ఆమె కళ్ళెత్తి చూడలేదు.

చేయి పట్టుకుని చూశాడు.

గాలీ, వర్షం కలిగిస్తున్న చలికన్నా చల్లగా వుంది. మంచు కంటె చల్లగా, అతిచల్లగా వుంది.

అంత చీకటిలో, వర్షంలో, నిర్మానుష్యంగా వున్న ఆ ప్రాంతంలో శవాన్ని పక్కనే పెట్టుకుని నించోవటానికి బాబుకి భయం వెయ్యలేదు. ఏడు పొచ్చింది. కర్తవ్యం గుర్తువచ్చినా, కదల్లేనట్లు అక్కడే నిలబడిపోయాడు.

దూరంగా వర్షం చినుకులలో మసక బారుతూ హరికెన్ లైట్లు కనిపించాయి. అవి అందిస్తున్న గుడ్డి వెలుగులో మానవాకారాలు కర్రలు తీసుకుని వస్తున్నాయి.

బాబు ముందుకు పరుగెత్తాడు.

బురదలో కాళ్ళు కూరుకుపోతున్నాయి. కస్సుమని కాలికి గుచ్చుకుందేదో. సూదుల్లా కళ్ళనుపొడుస్తున్నాయి నెత్తి మీద నుండి మొహం మీదికి జారుతున్న వర్షపు ధారలు. శక్తిని కూడదీసుకొని ముందుకు పరుగెత్తాడు బాబు.

"రామయ్య పెదనాన్నా! అక్క ఇక్కడ వుంది."

"రవీ అక్క ఇక్కడ వుందిరా!" ఏడుపులో గొంతు బొంగురు పోయింది. ఎలుగ్గొడ్డులా అరిచేడు.

అందరూ అటువేపు పరుగెత్తు కొచ్చారు.

బాబు సత్యం మాష్టారి చేతుల్లో వాలిపోతూ—

"మాష్టారూ! అక్క చచ్చిపోయింది" అంటూ భోరుమన్నాడు.

మాష్టారు చేతిలో కర్ర మరొకరికిచ్చి బాబుని దగ్గరగా పొదువుకుని వెన్ను నిమిరాడు.

"ఏమిటి? ఏమయింది?"

"ప్రెసిడెంట్ కొడుకు సురేంద్ర లేడూ, వాడూ ఇంకోడూ కలసి అక్కను ఏదో చేసి చంపేశారు" బాబు కళ్ళు పెద్దవయ్యాయి. కోపంతోనూ వర్షంలో తడవటం వలనా విపరీతంగా వణికిపోతున్నాడు. కసితో పళ్ళు కటకట లాడుతున్నాయి.

స్పృహ తప్పిన బాబు మాష్టారి చేతుల్లోంచి జారి క్రింద పడిపోయాడు. మాష్టారు లెఖ్ఖ చెయ్యకుండా ముందుకు పరుగెత్తాడు. కానీ ఆయనకక్కడ కనిపించింది తన ప్రియాతి ప్రియమైన మల్లి. కాబోయే జీవనసహచరి మల్లికాదు—ఆమె శవం.


*

వర్షం వెలిసింది. కానీ అది చేసిన బీభత్సానికి చిహ్నంగా విరిగిపోయిన చెట్లూ, మోకాల్లోతు బురదా, ఎక్కడ చూచినా ఎర్రటి బురద నీటి గుంటలూ మిగిలిపోయాయి.

మల్లేశ్వరి అంతిమ యాత్రకు సన్నాహం జరుగుతోంది. రవీ బాబూ ఒకళ్ళ నొకళ్ళు కౌగలించుకుని హృదయ విదారకంగా ఏడుస్తున్నారు. చూడటానికి వచ్చినవాళ్ళలో కంటతడి పెట్టని వాళ్ళులేరు. అందుకు కారణం—సత్యం మాష్టారి మీదున్న గౌరవమూ, మల్లేశ్వరిమీదున్న ప్రేమానూ. ఇవేమీ తనకు పట్టనట్లు అరుగుమీద నిశ్చింతగా నిద్రపోతూంది మల్లేశ్వరి.

"ఈ వయస్సులో నాకీ రంపపుకోత ఎందుకు రాశావురా భగవంతుడా? ఈ కడుపు కోతనెలా భరించను తండ్రీ! నేనేం పాపం చేశానని నాకింత శిక్ష విధించావు నాయనా? చేస్తే నన్ను తీసుకుపోక దాన్నెందుకెత్తుకు పోయావు తండ్రీ!" తల్లి శోకం ఆమెకు వినిపించటమే లేదు.

ప్రాణంలో ప్రాణంలా మెలిగి ఒక్కటవటానికి తహతహలాడిపోతూ నిరీక్షిస్తున్న ప్రియుడి గుండెల్లో రేగిన దావానలం ఆమెకు కనిపించటం లేదు.



ఒక వనితకు ఒక్కసారిగా ఆరుమంది పిల్లలు పుట్టారు. ఇద్దరు పిల్లలు పుట్టగానే మరణించారు. తక్కిన నలుగురి స్థితి అంత తృప్తికరంగా లేదు. అయినా తల్లి క్షేమంగానే ఉన్నది. ఇందులో విశేషం ఏముంది?

జపాన్‌లో ఒక్క కాన్పులో ఆరు మందిని కనడం అన్నది ఇదే మొదటి సారి! అదే విశేషం!

"నువ్వు లేకుండా నేనెలా బ్రతకగలను మల్లీ" అంటూ మూగగా రోదిస్తున్న అతని రోదన అరణ్య రోదనే అన్నట్లుగా ఆమె నిశ్చింతగా ప్రయాణమైంది.

మాష్టారి వెనకాలే బాబూ నడిచాడు.

ఎర్రగా పైకిలేచిన జ్వాలలు ఆగలేనట్లుగా మల్లిని కబళించాయి.

అంతవరకూ గంభీరంగా వున్న మాష్టారు ఘొల్లుమన్నాడు.

"మల్లీ! ఇంక నాకు తోడెవ్వరు? దేవుడికి పూజచేయించి వస్తానంటూ వెళ్ళావు నిజంగా ఆ దేవుడిదగ్గరకే వెళ్ళావా?" వెను వెంటనే ఫక్కుమని నవ్వాడు.

"పిచ్చిదానా! దేవుడు లేడు అంటే లెంపలేసుకోమని బలవంతం చేసేదానివి. క్షమించమని దేవుణ్ణి ప్రార్థించేదానివి. చూశావా? దేవుడు లేడు. వుంటే నీ కన్యాయం జరుగుతుంటే చూస్తూ వూరుకున్నాడా ఆ రాతి విగ్రహం....హ్హి...హ్హి.... పిచ్చిదానా! ముందు నుండీ నేను చెబుతున్నా వినిపించుకోకుండా నీ చావు కొనితెచ్చుకుని నన్నూ చంపుతున్నావు. దేవుడే నీకారాత రాశాడు. నువ్వు నాకీరాత రాశావు... మల్లీ! మల్లీ....ఒక్క విషయం చెప్పు! నువ్వు లేకుండా నేనెలా బ్రతకాలి. ఇంకేం వద్దు. ఒక్కసారి నాకు కనిపించి ఈ ఒక్క విషయం చెప్పు" మేష్టారు జుట్టు పీక్కున్నారు.

"అయ్యో! పిచ్చెక్కింది."

"ఇంకేముంది? అంతా అయిపోయింది."

"ఎంతలో ఎంతెంత ఘోరాలు జరిగిపోతున్నాయి?" మాష్టారిని పట్టుకోవటానికి వ్యర్థ ప్రయత్నాలు చేస్తున్నారు చాలామంది.

కన్నీళ్ళన్నీ కరిగిపోయి గాజుగోళాల్లా మెరుస్తున్న బాబు కళ్ళనుండి సెగలూ, పొగలూ చిమ్ముకుంటూ ఆఖరిసారిగా రెండు కన్నీటి బొట్లు రాలాయి. అప్రయత్నంగా చేతులెత్తి నమస్కరించాడు.

"దేవుడూ! నువ్వున్నావో లేవో నాకు తెలియదు. కానీ దారుణాలు జరగకుండా, లోకం అల్లకల్లోలమైపోకుండా వుండేందుకు నువ్వుండి తీరాలి!"

"దేవుడూ నువ్వుండి తీరాలి!"

"నువ్వుండి తీరాలి."